హిందీ కథ -1901

# గంపెడు మన్ను

హిందీ మూలం :
మాధవరావ్ సప్రే
అనువాదం :
ఘట్టమరాజు



ఓ జమీందారుగారి మేడకు దగ్గరగా ఓ బీద విధవరాలు గుడిసె ఉండేది. జమీందారుకు ఆ దిక్కులేని దాని గుడిసె స్థలాన్ని ఆక్రమించుకుని, తన ఆవరణను మరింత విశాలం చేసుకోవాలన్న కోరిక కలిగింది. అక్కడి నుంచి గుడిసెను తొలగించమని ఆమెకు అతను ఎంతగానో నచ్చ చెప్పాడు. కానీ ఆమె ఎంతోకాలం నుంచి అక్కడే ఉంటోంది. ఆమె భర్త, ఒక్కగానొక్క కొడుకు ఆ కొట్టంలోనే ప్రాణాలు విడిచారు. ఆమె కోడలు ఐదేళ్ల కూతుర్ని ముసిలిదాని కర్మానికి వదిలేసి ఈ లోకం దాటుకుంది. ఈ మనవరాలు తప్ప ఆ ముసలిదానికి నా అనేవారు లేరు. ఆమెకు పాత రోజులు

మాతృభాష మరాఠీ అయినా మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో ఉంటూ హిందీ సాహిత్యానికి మహత్తరమైన సేవ చేసిన మహాపురుషుడు, బి.ఏ. పట్టా పొంది, ఎవరికీ తలొంచకుండా బతుకు గడిపిన అభిమానధనుడు - మాధవరావ్ సప్రే (1871-1926) - తాను సొంతంగా నడుపుతున్న 'ఛత్తీస్‌గఢ్ మిత్ర' అన్న మాసపత్రికలో 1901 ఏప్రిల్ నెల సంచికలో 'ఏక్ టోకరీ భర్ మిట్టీ' అన్న కథ ప్రచురించారు. జమీందారులు పేదసాదలను పీడించే విధానం, సన్న జీవాల దైన్యం 'గంపెడుమన్ను' కథలో చిత్రింపబడింది.



జ్ఞాపకం వచ్చినప్పుడల్లా దుఃఖం పొర్లుకు వచ్చేది. పక్కింటి జమీందారుగారి కోరిక విన్నప్పటి నుంచి ఆమె నవనాడులూ కుంగిపోయాయి. గుడిసె అంటే ఆమెకు పంచప్రాణాలు. ఆ గుడిసెలోంచి తన శవం మాత్రమే వెళ్లాలన్నదే ఆమె చిరకాల వాంఛ. జమీందారు గారి ప్రయత్నాలన్నీ విఫల మయ్యాయి. చివరి కాయన కొత్త ఎత్తులు ఎత్తసాగాడు. నక్క జిత్తుల వకీళ్ల జేబులు నింపాడు. కోర్టు అనుమతి పొంది గుడిసెను ఆక్రమించుకున్నాడు. పాపం, దిక్కూమొక్కూ లేని ఆ ముసలిది ఇరుగు పొరుగువారిని ఆశ్రయించి రోజులు నెట్టుకు రాసాగింది.

ఓ రోజు జమీందారుగారు ఆ గుడిసె సమీపంలో పచార్లు చేస్తూ నౌకర్లకు పనులు పురమాయిస్తుంటే ఆ ముసిల్ది ఓ గంప చేతబట్టుకుని అక్కడకొచ్చింది. ఆమెను చూడగానే జమీందారు మండిపడుతూ అక్కడి నుంచి ఆమెను వెళ్లగొట్టమని నౌకర్లను ఆజ్ఞాపించాడు.

ఆమె అతని కాళ్లా వేళ్లా బతిమాలుతూ ఇలా అంది - "మహారాజా! ఈ గుడిసె ఇప్పుడు మీ సొంతం అయింది. దీన్ని అడగటానికి నేను ఇక్కడికి రాలేదు. మీరు పెద్ద మనసు చేసి నా మనవి వినాలి."

జమీందారు అలాగే అని తలాడించాడు.

"ఈ గుడిసె వదిలిపెట్టినప్పటి నుంచి నా మనుమరాలు ఒక్క మెతుకైనా మింగలేదు. పచ్చి గంగైనా ముట్టలేదు. నే నెంతో బతిమాలాను. కానీ నా మాట వినలేదు. 'మనింటికి పోదాం పద, అక్కడే రొట్టె తింటాను' అంటూ ఒకటే గొడవ చేస్తోంది. ఈ గుడిసెలోంచి గంపెడు మన్ను తీసుకెళ్లి దాంతో పొయ్యి చేసి, దానమీదే రొట్టెలు కాల్చాలని అనుకున్నాను. అప్పుడు ఆ రొట్టెల్ని నా మనుమరాలు తింటుందని నా నమ్మకం. అయ్యా! ఈ గుడిసెలో నుంచి ఓ గంపెడు మన్ను తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వండి. అంతే చాలు."




జమీందారు తల ఊపాడు.

ముసలామె గుడిసె లోపలికి వెళ్లింది. కాలు మోపగానే ఆమెకు పాత రోజులు జ్ఞప్తికి వచ్చాయి. కన్నీరు ధారలు కట్టింది. దుఃఖాన్ని దిగమింగుకుని, ఆమె ఓ గంపెడు మన్ను నింపుకుని బయటికొచ్చింది. "మహారాజా! ఈ గంపను కాస్త తలమీదికి ఎత్తండి!" అని ప్రార్థించింది.

జమీందారుగారు మండిపడ్డారు. ముసల్ది కాళ్లమీద పడి బతిమాలుకుంది. ఆయన మనస్సు కరిగి నౌకర్లను పురమాయించక, తానే గంపను ఆమె తలమీది కెత్తాలని ముందుకు ఓ అడుగు వేశాడు. కిందికి వంగి, గంప మీద చెయ్యేసి, పైకెత్తాలని చూశాడు. బలమంతా కూడగట్టుకుని ప్రయత్నించినా, ఆ గంప ఓ అడుగైనా పైకి లేవలేదు. " ఈ గంపను పైకెత్తడం నా తరం కాదు!" అని తల వంచుకుని అన్నాడు.

అప్పు డా విధవరాలు ఇలా అంది : "మహారాజా! కోపగించుకోకండి. ఓ గంపెడు మన్ను పైకెత్తడమే మీకు చేతకాదాయె. ఈ గుడిసెలో కొన్ని వేల గంపల మన్నుంది. జీవితమంతా ఈ భారాన్ని మీరు మోయగలరా? కాస్త ఆలోచించండి."

ధనమదం నెత్తికెక్కిన జమీందారు తన కర్తవ్యం మరిచిపోయాడు. కాని ముసలిదాని మాటలు ఆయన కళ్లు తెరిపించాయి. తన తప్పును క్షమించమని ఆమెను వేడుకున్నాడు. ఆమె గుడిసె ఆమెకు తిరిగి ఇచ్చాడు.